తారు లేచి అధ్వాన్నంగా ఉన్న రామన్నగూడెం-పప్పాపురం రోడ్డు

ప్రమాదకరంగా ఉన్న రోడ్డు చివర్లు

తారు లేచింది..

- అధ్వానంగా పప్పాపూర్ రోడ్డు
- కంకర రాళ్లతో ప్రజల అవస్థలు

ఏటూరునాగారం, జూన్ 8 : మండలంలోని రామన్నగూడెం నుంచి పప్పాపురం వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. రవాణాకు అనుకూలంగా లేకుండా కంకర లేచి నడవలేని పరిస్థితి ఏర్పడింది. రామన్నగూడెం నుంచి రాంనగర్ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు అనేక చోట్ల గుంతలు పడింది. పలు చోట్ల తారు లేచి పోయి కంకర రోడ్డుగా దర్శనమిస్తున్నది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ మార్గంలో వెళ్లడం కష్టంగా మారింది. పలు చోట్ల రోడ్డు చివర్లు ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే ప్రజలకు నరకంగా మారింది. పప్పాపురానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో రామన్నగూడెం మీదుగా మండలకేంద్రానికి ఈ మార్గం గుండానే వస్తుంటారు. రెండు సంవత్సరాల క్రితం ఈ రోడ్డుపై ఇసుక లారీలు నడువడంతో రోడ్డు అనేక చోట్ల దిగబడి ప్రమాదకరంగా మారిందని రైతులు చెప్తున్నారు. ఇసుక లారీ ఓవర్ లోడ్‌తో వెళ్లినప్పుడు ఒక వైపు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రామన్నగూడెం, రాంనగర్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు పప్పాపురం శివారులోని చెరువుల కిందనే ఉన్నాయి. వర్షాకాలంలో వ్యవసాయ పరికరాలు, ఎరువులు తీసుకెళ్లడానికి ఇబ్బంది పడుతున్నట్లు రైతులు తెలిపారు. అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం ఈ రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పంట చేతికొచ్చిన తర్వాత కూడా ట్రాక్టర్లు, లారీల్లో ధాన్యం తరలించడం కష్టంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. రోడ్డు బాగు చేసి తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ఎడ్లపల్లి గ్రామస్తులు
- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

మల్హార్, జూన్ 8 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని ఎడ్లపల్లి గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఈదుగారులులతో కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దానిని మరమ్మతు కోసం తీసుకెళ్లిన అధికారులు ఇప్పటి వరకు బిగించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో బోర్ మోటర్ నడవక, మిషన్ భగీరథ నీరు రాక తాగునీటి సమస్య ఏర్పడిందని వారు వాపోయారు. రోజువారీ అవసరాలకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని 2వ వార్డు మహిళలు శనివారం ఖాళీ బిందెలు, బకెట్లతో రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి నీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

ఖాళీ బిందెలతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రశాంతంగా టెన్త్ భౌతికశాస్త్రం పరీక్ష

భూపాలపల్లి రూరల్, జూన్ 8 : జిల్లాలో శనివారం నిర్వహించిన పదో తరగతి భౌతిక శాస్త్రం సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి ఎం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఫెయిల్ అయిన వారి కోసం భూపాలపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 67 మందికి 53 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 14మంది గైర్హాజరయ్యారని వారు పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

శివ (ఫైల్)

వెంకటాపురం (నూగూరు), జూన్ 8 : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని చిరుతపల్లి గ్రామానికి చెందిన మిచ్చా శివ(25) శుక్రవారం ఇంటి ఆవరణలో ఉన్న తాటి ఆకులు కోసేందుకు చెట్టు ఎక్కాడు. అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలు కాగా వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎజీఎం దవాఖానకు తరలించినట్లు తెలిపారు. కాగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

విద్యార్థిని తులసికి ఆర్థికసాయం

తులసికి రవాణా ఖర్చులు ఇస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట, జూన్ 8 : డ్రామా జూనియర్స్‌లో ఎంపిక కోసం వెళ్తున్న విద్యార్థినికి రవాణా ఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయులు రూ.వెయ్యి అందజేశారు. ప్రాజెక్టు నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెంది ఆరో తరగతి విద్యార్థిని తులసి హైదరాబాద్‌లో జరుగనున్న ప్రోగాంకు ఎంపికైంది. దీంతో ఆమెకు ఖర్చు నిమిత్తం ఉపాధ్యాయులు యాప సమ్మయ్య, యాప విజయలలిత డబ్బులు అందజేసి అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మృతి చెందిన పాడి గేదె

భూపాలపల్లి రూరల్, జూన్ 8 : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని దూదేకులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొప్పెర పద్మ పాడి గేదె శనివారం ఉదయం మేతకు వెళ్లి గ్రామ చివరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం, విద్యుత్ అధికారులు ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

ములుగు రూరల్ : మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ

రాజీమార్గంతో ప్రశాంతమైన జీవనం

ములుగు, భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్తులు

ములుగు రూరల్/కృష్ణకాలనీ, జూన్ 8 : కోర్టు కేసుల్లో రాజీ కుదుర్చుకోవడం వల్ల కక్షిదారులు ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని ములుగు, భూపాలపల్లి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్లు, ప్రధాన న్యాయమూర్తులు సూర్యచంద్రకళ, పీ నారాయణబాబు అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పలు కేసుల్లో రాజీ కుదుర్చారు. ములుగులో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి 323, భూపాలపల్లిలో నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేసి 815 పెండింగ్ కేసులను పరిష్కరించినట్లు వారు తెలిపారు. అలాగే ములుగు కోర్టు పరిధిలో 342 కేసులను పరిష్కరించి బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి నష్టపరిహారం కింద రూ.11,86,839 అందించినట్లు చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జిలు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కన్నయ్యలాల్, కే జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు రామ్మోహన్‌రెడ్డి, ఎన్ రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జీఅఖిల, ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, డీఎస్పీ రవీందర్, బార్ అసోషియేషన్ అధ్యక్షులు మస్రగాని వినయ్‌కుమార్, కూనూరు సురేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లా మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే పావణి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, అడిషనల్ పీపీ రఫీక్, కలెక్టరేట్ ఏవో ప్రసాద్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాదులు నర్సిరెడ్డి, మహేందర్, చంద్రయ్య, సుధాకర్, స్వామిదాస్, ప్రతాప్, రాజ్‌కుమార్ బెంచ్ మెంబర్లు కాళిదాసు, విష్ణుచందర్, వేశాల రవీందర్, పారనంది సురేశ్, మచ్చ వసంత పాల్గొన్నారు.

కృష్ణకాలనీ : కేసులు పరిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

నేడు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- 17 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- సెంటర్ల పరిసరాల్లో 144 సెక్షన్
- నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జూన్ 8 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ భవేశ్‌మిశ్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4,394 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను 9 గంటల నుంచే లోనికి అనుమతిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఓఎంఆర్ మోడల్‌లో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోమెట్రిక్ హాజరు ఇవ్వాలని, పరీక్ష ముగిసే వరకు బయటకు రావొద్దని, హాల్‌టికెట్‌పై ముద్రించిన సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు, బూట్లు అనుమతించరని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అభ్యర్థుల సౌలభ్యం కోసంప్రతి అరగంటకు హెచ్చరిక బెల్ కొట్టడం జరుగుతుందని, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగులకు 50 నిమిషాలు ఎక్కువ సమయం ఇవ్వడం జరుగుతుందని, కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని వివరించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే లోపలికి అనుమతించాలని, గుర్తింపు కార్డు లేని వ్యక్తులు, అనుమానిత వాహనాలు పరీక్షా కేంద్రంలో ఉండకుండా చూడాలని కలెక్టర్ సూచించారు.

గణపురం : ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎస్ సుమన్

గణపురంలో..

గణపురం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 360 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని చీఫ్ సూపరింటెండెంట్ నలుబాల సుమన్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఎన్నికైన గౌడ సంఘం నూతన కార్యవర్గం

ఏటూరునాగారం, జూన్ 8 : స్థానిక రేణుకా ఎల్లమ్మ గుడి ఆవరణలో శనివారం గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం మొగిలి, ఉపాధ్యక్షుడిగా సప్పిడి రాంనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వినయ్‌కుమార్, కోశాధికారిగా తాళ్లపల్లి మోహన్, సహాయ కార్యదర్శిగా గడ్డం ప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శిగా ముంజ రాజేందర్, సభ్యులుగా గడ్డం సంతోశ్, మెరుగు రఘు, గడ్డం రవి, మోడం చందు, పంజాల కృష్ణ, గడ్డం సతీశ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కూనూరు అశోక్, మోడెం వెంకటస్వామి, బూర రాజయ్య, మోడెం రమేశ్, తాళ్లపల్లి వెంకటస్వామి, కూనూరు వీరేశం, కూనూరు రవిని నియమించారు.

రామోజీరావుకు నివాళి

సంతాపం తెలిపిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర

వాజేడు/ భూపాలపల్లి రూరల్/ గోవిందరావుపేట, జూన్ 8 : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వాజేడు మండల మీడియా అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీరావు రెండు రాష్ట్రాలకు, దేశానికి ఎన్నో సేవలు అందించారని, రామోజీ ఫిల్మ్ సిటీ విశ్వవ్యాప్తం అయిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాజేడు మండలకేంద్రంలోని వేప చెట్టు సెంటర్ వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విలేకరులు షేక్ దావుద్, సతీశ్, వేణుబాబు, సర్వేశ్వర్‌రావు, నర్సింహారావు, మల్లి ఖార్జున్‌రావు, రాంబాబు, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, మహబూబ్‌పాషా, రాంబాబు, దామోదార్, కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్, జగన్నాథరాజు, ఖాజావలీ పాల్గొన్నారు. అలాగే గోవిందరావుపేట మండలకేంద్రంలో కమ్మ సంఘం మండల అధ్యక్షుడు పాలడుగు ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, శేలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకాపూడి గాంధీ హాజరై రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, మండల ఉపాధ్యక్షుడు వెంకన్న, జనరల్ సెక్రటరీ గోపి, మాజీ అధక్షుడు సాంబశివరావు, గౌవర అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, వెంకటకృష్ణ, ప్రసాద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విలేకరులు, కాంగ్రెస్ నాయకులు


గోవిందరావుపేట: నివాళులర్పిస్తున్న ఆరెకాపూడి గాంధీ, కమ్మ సంఘం నాయకులు

జాతీయ రహదారిపై ఇసుక లారీల తనిఖీ

లారీని తనిఖీ చేస్తున్న ఎస్సై

వాజేడు, జూన్ 8 : మండలంలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ఇసుక లారీలతో పాటు ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలు తనిఖీ చేశారు. ఇసుక లారీలను బరువుతో పాటు నకిలీ నంబర్ ప్లేట్లు మార్చారా అని క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. అనుమానితులను అదుపులోకి తీసుకోని విచారించారు.

కేసీఆర్‌ను కలిసిన సోమనపల్లి మాజీ సర్పంచ్

కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మహేశ్‌యాదవ్, రాకేశ్‌రెడ్డి

టేకుమట్ల, జూన్ 8 : మండలంలోని సోమనపల్లి తాజా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉద్దమారి మహేశ్‌యాదవ్ శనివారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన సమీక్షా సమావేశానికి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి హాజరైనట్లు మహేశ్‌యాదవ్ తెలిపారు.

క్రీడా మైదానాలపై పట్టింపేది?

తుప్పు పట్టిపోతున్న క్రీడోపకరణాలు

టేకుమట్ల, జూన్ 8 : పల్లెల్లోని యువతకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు, వారిని అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా కేసీఆర్ క్రీడా కిట్లను సైతం పంపిణీ చేసింది. అయితే ఇప్పుడు వాటిని పట్టించుకునే వారు లేక మండలంలోని క్రీడా మైదానాల న్నీ పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో దర్శనమిస్తున్నాయి. మండలకేంద్రంలో ప్రధాన రహదారి వెంట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మైదానంలో క్రీడోపకరణాలు కింద పడి తుప్పుపట్టిపోతున్నాయి. మండలకేంద్రంలోనే ఇలా ఉంటే ఇక మారుమూల పల్లెల్లో పరిస్థితి ఏంటని క్రీడాభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాలకు క్రీడోపకరణాలు పూర్తిగా పాడవకుండా చర్యలు తీసుకోవాలని, మైదానాల్లోని పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఏసు కుటుంబానికి రూ.25వేలు అందజేస్తున్న దళిత నాయకులు

ఏసు కుటుంబానికి ఆర్థికసాయం

వాజేడు, జూన్ 8 : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లందు ఏసు కుటుంబానికి శనివారం వెంకటాపురం, వాజేడు మండలాల్లోని వివిధ దళిత సంఘాల నాయకులు పరామర్శించారు. తమ వంతు సాయంగారూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు కోకిల మల్లికార్జున్, యాసం మహేశ్, చెన్నం నరేశ్, తోకల శివ, చెన్నం స్వామి, కొగిల ఆనంద్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలి

చిట్యాల : చల్లగరిగ బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహదేవపూర్/ టేకుమట్ల/ చిట్యాల, జూన్ 8 : బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మహదేవపూర్ మండలకేంద్రంతో పాటు బొమ్మాపూర్, సూరారం, బెగ్లూర్, అంబట్‌పల్లి, పెద్దంపేట, కుదురుపల్లి, ఎడపల్లి, ఎన్కపల్లి, రాపల్లికోట, బ్రాహ్మణపల్లి, ఎల్‌కేశ్వరం గ్రామాలు, టేకుమట్ల మండలంలోని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు గ్రామాల్లో ఉపాధ్యాయులతో పాటు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న వసతులు, విద్యా బోధనను వివరించారు. మెరుగైన విద్య, ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ బుక్స్, యూనిఫాం అందజేయన్నుట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. చిట్యాల మండలం చల్లగరిగ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆరుగురు గురుకులాల్లో సీట్లు సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు పంచిక భగవాన్‌రెడ్డి, సౌజన్య, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.

మహదేవపూర్ : విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల : రామకృష్ణపూర్(టీ)లో బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇసుక టిప్పర్లు సీజ్

వెంకటాపురం(నూగూరు), జూన్ 8 : మండలంలోని వీరభద్రవరం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. తహసీల్దార్ వీరభద్రప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని గోదావరి ఇసుక రీచ్ నుంచి టిప్పర్లతో ఇసుకను డంపింగ్ చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. రెండు టిప్పర్లతో ఇసుక తరలిస్తుండగా వాటిపి స్వాధీనం చేసుకొని రెవెన్యూకార్యాలయానికి తరలించినట్లు చెప్పారు.

అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎస్సై అశోక్

వెంకటాపురం (నూగూరు), జూన్ 8 : అసాంఘిక శక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రేఖాఅశోక్ అన్నారు. శనివారం మండలంలోని కర్రివానిగుప్ప గ్రామంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

1999-2000 పదో తరగతి విద్యార్థులు

రామప్పలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెంకటాపూర్, జూన్ 8 : రామప్ప దేవాలయ సమీపంలోని పాలంపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు పాఠశాల జీవితంలో గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిడెం బలరాం, పైండ్ల దర్శనం, సాంబశివరావు, సుధాకర్, రాజు, నర్సింగరావు, అనిల్, అశోక్, సంగీత, కృష్ణవేణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మృగశిర కార్తెతో చేపలకు డిమాండ్

కాటారం : నస్తురుపల్లి చెరువు వద్ద చేపల కోసం వచ్చిన గ్రామస్తులు

ఏటూరునాగారం/ కాటారం/ కృష్ణకాలనీ/ గణపురం, జూన్ 8 : మృగశిర కార్తె సందర్భంగా శనివారం మార్కెట్లలో చేపలకు డిమాండ్ ఏర్పడింది. కార్తె ప్రారంభం రోజున చేపలు తినాలనే సెంటిమెంట్ ఉండడంతో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ప్రజలు చేపల కోసం గోదావరి, చెరువులు, విక్రయ కేంద్రాలకు తరలివచ్చారు. కేజీకి రూ.200 నుంచి రూ.250 చొప్పున విక్రయిస్తున్నట్లు వినియోగదారులు తెలిపారు. 11 గంటల వరకు కూడా చేపల విక్రయాలు జోరుగా కొనసాగాయి.

గణపురం: చేపల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
jobs Apply Now!
SepTeK
★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.
NTW-318919
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953
HEALTH CARE
★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును.
సంప్ర॥ 6281476205, 9440325526
KMM_11679
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
JANGAON - 9182777565